విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జెరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 106 | గురువారం 13. 8. 2026 | ఎడిటర్: జెరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00



# ఆర్మీ చేపట్టే నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహిస్తాం
## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్‌తో సమావేశం
- ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి ఉన్న అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు
- దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్లకు ముందస్తుగా తెలంగాణలోని ఆయా జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తాం
- దేశంలో విపత్తుల సమయంలో ఆర్మీ పోషిస్తున్న పాత్రను ముఖ్యమంత్రి అభినందనలు
- రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం
- తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకునేలా స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తాన

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి భారత ఆర్మీ సదరన్ కమాండ్ అధికారులకు తెలిపారు. ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ గారు పలువురు ఆర్మీ ప్రతినిధులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి ఉన్న అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు కోరగా లెఫ్టినెంట్ జనరల్ సుముఖత వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్లకు ముందస్తుగా తెలంగాణలోని ఆయా జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# ఎల్బీనగర్ పీఎస్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

- ఏసీపీ కార్యాలయంలోని రెస్ట్ రూమ్‌లో ఉరేసుకున్న జె.సాయి కుమార్
- పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలింపు
- 2024 బ్యాచ్‌కు చెందిన సాయికుమార్ ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్
- కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిలో ఉంటున్న కానిస్టేబుల్
- ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
- ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.
- మరో వైపు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు




# హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం..

శేరిలింగంపల్లి: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గంజాయి సరఫరా చేస్తున్న మాజీ విద్యార్థిని గచ్చిబౌలి పోలీసులు, ఈగల్ టీమ్ అరెస్ట్ చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన భిస్వజిత్ కలితా అలియాస్ బిస్వా (28)గా నిందితుడిని గుర్తించారు. ప్రస్తుతం గోపన్‌పల్లిలో నివాసముంటూ యాక్టర్ ట్రైనర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వర్సిటీ మెన్స్ హాస్టల్-ఎల్‌లో గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఓ విద్యార్థి ఇచ్చిన సమాచారంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒక్కో విద్యార్థికి రూ.500కే 10 గ్రాముల ఎండు గంజాయిని విక్రయించినట్లు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ సమయంలో నిందితుడి వద్ద నుంచి ఈగల్ టీమ్ 5 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఈ గంజాయి ముఠా వెనుక ఉన్న ప్రధాన సరఫరాదారులు ఎవరు? క్యాంపస్‌లో మరికొందరు విద్యార్థులకు ఇందులో ప్రమేయం ఉందా? అనే కోణాల్లో గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఈగల్ టీమ్ నిర్వహించిన పరీక్షల్లో 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది.




# మేం టీ హబ్ తెస్తే.. రేవంత్ రెడ్డి అనుముల హబ్స్ అనే పథకాన్ని తెచ్చాడు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్‌ను నిర్మించాం
- ప్రస్తుతం కుటుంబ సభ్యుల ఆధారంగా, ఎలాంటి ఆవిష్కరణలు
- ఉద్యోగులు లేకుండా 'అనుముల హబ్స్'ను రూపొందిస్తున్నారు
- అనుముల కుటుంబానికి చెందిన వారైతే తక్కువ ధరకు ప్రభుత్వ భూములు కేటాయిస్తున్నారు
- 'అనుముల కొండల్‌రెడ్డి'ని శతాబ్దపు గొప్ప ఆవిష్కర్తగా ప్రతిపాదిస్తున్నా
- రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించారు

# ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానం: రాంచందర్ రావు



**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు భారత్ ఎంతో ప్రగతి సాధించిందని, ముఖ్యంగా డిజిటల్ ఇండియా, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడుల సాధనలో దేశం మైలురాళ్లను అధిగమించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు గుర్తుచేశారు. ఎస్వీపీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సైన్స్ ఫండ్ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్, శాస్త్రీయ ఆవిష్కరణల రంగానికి కూడా తగిన ఆర్థిక సహాయం అందించడం చాలా అవసరమని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిందని, సైన్స్ రంగానికి కేవలం ప్రభుత్వం నుంచే కాకుండా ప్రైవేట్ భాగస్వాముల నుంచి కూడా ఫండింగ్ పెరిగినప్పుడే నూతన ఆవిష్కరణలు, ఎంఎస్ఎంఈ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత దృఢపడుతుందని తెలిపారు.

# గోదావరి జలాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
రాష్ట్రంలో గోదావరి జలాలను వీలైనంత గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ, గోదావరి వరద ప్రవాహాలు, నీటి ఎత్తిపోతల ప్రక్రియపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి నీటిని పూర్తిస్థాయిలో ఎత్తిపోయాలని సీఎం స్పష్టం చేశారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి సాంకేతిక, ఇతర సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని



అధికారులను ఆదేశించారు. సదరు ప్రాజెక్టుల వల్ల ప్రభావితమైన ముంపు బాధితులకు చెల్లించాల్సిన పెండింగ్ పరిహారం, పునరావాస చెల్లింపులను వెంటనే వేగవంతం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# మేడిగడ్డ బ్యారేజీ కేసులో కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగు బాటుకు సంబంధించిన కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ మొత్తం వ్యవహారంలో తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. గతంలో పంపిన నోటీసులు ఆయనకు అందలేదని తేలడంతో మళ్లీ నోటీసులు పంపాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు పక్కాగా జారీ చేయాలని జిల్లా న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను జిల్లా కోర్టు సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. కాగా, మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో అక్రమాలు, నాణ్యతా లోపాలపై గతంలో రాజలింగమూర్తి అనే వ్యక్తి కోర్టులో ప్రైవేట్ పిటిషన్



దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషనర్ మృతి చెందినప్పటికీ, కేసు విచారణను ఆపకుండా కొనసాగించాలని గతంలో తెలంగాణ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. మేడిగడ్డ పిల్లర్లు కుంగిన ఘటనపై నమోదైన ఈ పిటిషన్‌పై భూపాలపల్లి జిల్లా కోర్టులో విచారణ సాగుతుండటం, కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు జారీ కావడం స్టేట్ పాలిటిక్స్‌లో ఆసక్తికరంగా మారింది.

# పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం..

- ప్రతి ప్రశ్నకూ సమాధానం చెబుతా
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం
- అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా?
- చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ



# కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్లు ఎక్కడివో చెప్పాలి

- నగరంలో భూ కేటాయింపుల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం
- భూ కేటాయింపులపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు మండిపాటు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారు
- లతమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం
- ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.
- కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్
- అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచన
- హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది
- పారిశ్రామికవేత్తలను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు
- నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోం
- జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తాం






# 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్' చెల్లదు: ఎన్నికల సంఘం

తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కొత్తగా జారీ చేస్తున్న 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ల' చెల్లుబాటుపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 25న జారీ చేసిన జీఓ నంబర్ 172 ప్రకారం 'మీసేవ' ద్వారా ఇచ్చే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియలో ఆమోదించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈసీ కార్యదర్శి నవీన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అధికారిక లేఖ రాశారు. గతంలో తహశీల్దార్లు క్షేత్రస్థాయి విచారణ, పత్రాల తనిఖీ చేపట్టిన తర్వాతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను జారీ చేసేవారని ఈసీ పేర్కొంది. కానీ, జీఓ 172 ప్రకారం ఎలాంటి ముందస్తు విచారణ లేకుండా, కేవలం రేషన్ కార్డు డేటా ఆధారంగా ఆన్‌లైన్‌లో రెండు రోజుల్లోనే ఈ సర్టిఫికెట్లు ఇస్తున్నారని గుర్తుచేసింది. ఫలితంగా ఈ కొత్త సర్టిఫికెట్ కేవలం 'రేషన్ కార్డు'తో సమానమని వివరించింది.

## అర్హులందరికీ పారదర్శకంగా 'చేయూత' పింఛన్లు

**జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**




**నిర్మల్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అర్హులైన ప్రతి లబ్ధిదారునికి 'చేయూత' పింఛన్లు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో చేయూత పింఛన్ల దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్లు, వనమహోత్సవం, తెలంగాణ జలసిరి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. కొత్త చేయూత పింఛన్లకు ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించి, అర్హతలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల వారు గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, వనమహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ జలసిరి కింద సోక్‌పిట్లు, బోర్‌వెల్లు, ఫామ్‌పాండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలను సీజ్ చేసి జరిమానాలు విధించాలని కలెక్టర్ ఆదేశించారు.

## కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లను పరిశీలించిన కలెక్టర్



**నిజామాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. కేజీబీవీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖాళీ స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న ఆర్ఓ ప్లాంట్, సోలార్ హీటర్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల పాఠాలు బోధించి, వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తాత్రి, ఎంఈఓ గాలప్ప, కేజీబీవీ ప్రత్యేక అధికారి దీపిక, సహాయ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు అధికారులు, రైతులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో నీటి లభ్యత, ప్రాజెక్టుల నిల్వలు, వర్షాభావ పరిస్థితులపై సమీక్షించారు. తాగునీటికి తొలి ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను రైతులు ఎంచుకునేలా అవగాహన కల్పించాలని, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలని రైతులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ జగదీష్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రభు కల్యాణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీల్, సంబంధిత శాఖల అధికారులు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 6వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్




**ఎల్లారెడ్డి: ఆగస్ట్ 12 తెలంగాణ వాణి ప్రతినిధి**
ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో గల గర్ల్స్ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీ జె. జగ్జీవన్ మరియు కౌన్సిలర్ శ్రీ సయ్యద్ గఫార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, పొదలు మరియు బుష్ కట్టింగ్ పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, మురుగు కాలువల్లో పూడిక తొలగించి నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రపరచాలని, దోమల వృద్ధికి అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్ల్స్ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థినులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, దోమల నివారణ మరియు ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం చర్యలు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకొని మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

# అంతర్రాష్ట్ర బైక్ దొంగతనాల ముఠా గుట్టురట్టు

- 5 గురు దొంగలు, 3 గురు దొంగ బండ్లు కొనుగోలు చేసిన వ్యక్తులు అరెస్ట్.
- వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,

**ఆదిలాబాద్, ఆగస్టు : 12 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్ర పరిసర ప్రాంతాల్లో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసి వారి ఆటలను కట్టడి చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. స్థానిక పోలీస్ హెడ్క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, సిసిటీవీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.




దర్యాప్తులో భాగంగా ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ తన సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితులు గత కొంతకాలంగా మరికొందరితో కలిసి ముఠాగా ఏర్పడి అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇచ్చోడ, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర పరిసర ప్రాంతాల్లో సుమారు 44 ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు వెల్లడించారు. దొంగిలించిన వాహనాల నంబర్ ప్లేట్లను మార్చి, ఇతరులకు విక్రయించి లాభం పొందినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. నిందితుల సమాచారం మేరకు పోలీసులు 44 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇచ్చోడ పోలీసులు సాంకేతిక ఆధారాలతో చాకచక్యంగా దర్యాప్తు చేసి అంతర్రాష్ట్ర బైక్ దొంగతనాల ముఠాను పట్టుకుని 44 ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే , ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ పై రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమం



**నిజామాబాద్ ఆగస్టు 12: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ఎయిడ్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు నెలల పాటు జరిగే అవగాహన కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భుజంగరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని కలిగి ఉండాలి అని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ గారి ఛాంబర్ లో ఎయిడ్స్ పై ఐఐఈసీ తీవ్రతరమైన విజ్ఞాన సమాచారం- అవగాహన) కార్యక్రమాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీతో పాటు తమ ప్రమాదకర పరిస్థితిని తెలుసుకునే క్యూఆర్ కోడ్ (దీతీముని టతీవవ ఖుజూ)పోస్టర్ ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశానుసారం హెచ్ఐవి ఎయిడ్స్ నివారణలో భాగంగా... ఈ విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ఎటువంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం రెండు నెలల పాటు కొనసాగుతుందని అన్నారు. అనంతరం డీ ఎం హెచ్ వో డా.రాజశ్రీ మాట్లాడుతూ ఈ కార్యక్రమము రెండు నెలల పాటు జిల్లాలో కొనసాగుతుందని ఇందులో భాగంగా 200 కళాశాల మరియు పాఠశాల విద్యార్థులకు , 200 ఎంపిక చేసిన గ్రామాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంది. అలాగే దీనిపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుంది. అలాగే యువత అవగాహన కొరకు బైక్ ర్యాలీని కూడా ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డా. దేవి నాగేశ్వరి టిబి నియంత్రణ అధికారి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్ ,ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ వెంకన్న, డాక్టర్ సుప్రియ,హెల్త్ ఎడ్యుకేటర్ గన్ పూర్ వెంకటేష్, సుధాకర్, నవీన్ స్నేహ సొసైటీ సిద్దయ్య డిపిఓ విశాల, హెచ్ఈఓ గోవర్ధన్, నాగరాజు,అలాగే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ,వివిధ స్వచ్ఛంద సంస్థలు స్నేహ సొసైటీ, వర్దు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, వై ఆర్ జి నుండి సిబ్బంది పాల్గొన్నారు.

# క్యూబా విప్లవయోధుడు కాస్ట్రో



అగ్రరాజ్యం అమెరికాకు అతి స్వల్ప మైళ్ళ దూరం లో ఉన్న ఒక చిన్న ద్వీప దేశం నుంచి సామ్రాజ్యవా దాన్ని సవాల్ చేసి గెలిచి నిలిచిన ధీశాలి ఫిడెల్ కాస్ట్రో.సి.ఐ.ఎ వంటి గూఢచారి సంస్థలు తనని హతమార్చడానికి ఏకంగా 634 సార్లు పన్నిన కుట్రల ను ఆయన తిప్పికొట్టారు. దోపిడీ వ్యవస్థపై ఆయన ధిక్కార స్వరాన్ని రగిలించి తిరుగుబాటు జెండా ఎగుర వేసి విజయం సాధించి ప్రపంచ పీడిత దేశాలకు ఆదర్శంగా నిలిచారు.

ఫిడెల్ కాస్ట్రో 1959 లో ఫుల్జెన్సియో బాటిస్టా యొక్క సైనిక నియంతృ త్వాన్ని కూలదోసి పశ్చి మార్ధగోళంలో మొట్ట మొదటిసారిగా కమ్యూనిస్ట్ రాజ్యాన్ని స్థాపించారు. సోవియట్ యూనియన్ అందించిన సహాయంతో క్యూబా చెప్పుకోదగ్గ పురోగతిని సాధించింది. కాని ఆ సోవియట్ యూని యన్ పతనం కావడం, అరవై ఏళ్లకు పైగా అమెరికా ఆంక్షలు కొనసాగిస్తున్న మూలంగా నేడు క్యూబా ఆర్థికంగా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతునే ఉంది. కాస్ట్రో నేతృత్వంలో విజయవంతమైన క్యూబా ఇటీవలి కాలంలో ఒకవైపు గా సంక్షోభాలను ఎదుర్కొంటూనే మరోవైపుగా ఇతర దేశాలకు వైద్య సహాయ సహకారాలను అందిస్తూ ప్రపంచ దేశాల ప్రశంసలు పొందుతున్న ఈ తరుణం లో కాస్ట్రో శత జయంతిని ఈ ఆగస్టు 13 నాడు జరు పుకుంటుంది.
కాస్ట్రో 1926 ఆగస్టు 13 నాడు తూర్పు క్యూబాలోని బిరాన్ అనే ఒక చిన్న పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి ఒక సంపన్న స్పానిష్ చెరకు రైతు. ఆయన క్యూబా స్వాతంత్ర్య యుద్ధం సమయంలో మొదటిసారిగా ఆ ద్వీపానికి వచ్చారు. కాస్ట్రో జెస్యూట్ పాఠశాలలో చదువుకున్నారు. ఆయన విద్యార్థి దశ నుండి లాటిన్ అమెరికా అంతటా విప్లవ కార్యకలాపాలలో పాల్గొన్నారు.
కాస్ట్రో 1950 లో హవానా విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో పట్టా పొంది న్యాయవాద వృత్తిని చేపట్టారు. 'ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ స్టూడెంట్స్' (ఎఫ్.ఇ.యు)కు అధ్యక్షత వహించారు. అవినీతి వ్యతిరేక ఆర్థడాక్స్ పార్టీలో ఆయన చేరారు. విశ్వవిద్యాలయ విద్యను పూర్తి చేసిన తర్వాత కాస్ట్రో 'ప్రతినిధుల సభకు పోటీ చేయడం ద్వారా జాతీయ రాజకీయాల్లోకి రావాలి' అని నిర్ణయించుకున్నాడు. కాస్ట్రో 1952 లో క్యూబన్ పీపుల్స్ పార్టీ తరపున అభ్యర్థిగా బరిలో నిలబడిననూ ఫుల్జెన్సియో బాటిస్టా జరిపిన వినాశకరమైన సైనిక తిరుగుబాటు కార్లోస్ ప్రియో సోకారాస్ ప్రభుత్వాన్ని కూలదోసి భవిష్యత్ ఎన్నికలను నిషేధించింది. ఈ ప్రతికూలతను ఎదుర్కొన్న కాస్ట్రో ఆ సమయంలో క్యూబాలో రాజకీయ పోరాటంలో పాల్గొనడానికి 'ఎన్నికలు మరియు చట్టపరమైన ఫిర్యాదులు సరైన మార్గం కాదు' అని గ్రహించి 'ప్రజా తిరుగుబాటు'కు ప్రణాళిక రచించారు.
కాస్ట్రో 1953 జూలైలో 120 మందితో కలిసి శాంటియాగో డి క్యూబాలోని మోంకాడా సైనిక శిబిరంపై దాడికి నాయకత్వం వహించారు. కాని ఆ దాడి విఫలం కావడమే కాకుండా కాస్ట్రో పట్టుబడి జైలు శిక్షకు గురయ్యాడు. అతని అనుచరులలో చాలామంది మరణించారు. తన నిరంకుశ ప్రతిష్టను మెరుగుపరుచుకోవాలని చూస్తున్న అమెరికా మద్దతు ఉన్న బాటిస్టా తదనంతరం 1955 లో సాధారణ క్షమాభిక్షలో భాగంగా కాస్ట్రోను విడుదల చేశారు. జైలు నుండి విడుదలైన కాస్ట్రో అమెరికా మరియు మెక్సికో దేశాలకు ప్రయాణించారు. మెక్సికోలో అతను స్పానిష్ అంతర్యుద్ధంలో పాల్గొన్న ఆల్బెర్టో బాయో అనే మాజీ యోధుడి వద్ద శిక్షణ పొందారు. ఎర్నెస్టో చే గెవారాతో సహా పలువురు యోధులతో కలిసి యుద్ధ ప్రణాళికలు రచించారు.
యువ విప్లవకారులు సాయుధ పోరాట మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నారు. 1956 లో 82 మందితో 'గ్రాన్మా' పడవలో క్యూబా తీరానికి చేరిన కాస్ట్రో బృందంపై బాటిస్టా సైన్యం మెరుపుదాడి చేయగా కాస్ట్రో,రౌల్ కాస్ట్రో,చే గెవారా సహా 17 మంది గెరిల్లాలు మాత్రమే మిగిలారు. క్రమంగా స్థానిక ప్రజలను సమీకరించి 1958 చివరి నాటికి దేశంలోని తూర్పు మరియు మధ్య ప్రాంతాలలో అధిక భాగాన్ని కాస్ట్రో జయించగలిగారు. చే గెవారా మరియు అతని సైన్యాలు హవానా యొక్క చివరి వ్యూహాత్మక రక్షణ కేంద్రమైన శాంటా క్లారా నగరాన్ని స్వాధీనం చేసుకోగలిగారు. 1959 లో హవానా వీధుల్లోకి విప్లవ సైన్యం ప్రవేశించడంతో అమెరికా తొత్తు బాటిస్టా పలాయనం చిత్తగించారు. గెరిల్లాలు 1959 జనవరి 1 నాడు బాటిస్టా నుండి అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. కాస్ట్రో హవానాకు చేరుకుని ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అధికారం చేపట్టిన తర్వాత కాస్ట్రో చట్టపరమైన వివక్షను రద్దు చేయడమే కాకుండా విద్య, వైద్య తదితర రంగాలను అభివృద్ధి చేశారు.

క్యూబన్ ప్రవాసులు 1961 లో కాస్ట్రోను కూలదోయాలనే ఉద్దేశ్యంతో 'బే ఆఫ్ పిగ్స్' సమీపంలో దిగగానే వారి ప్రణాళికలను కాస్ట్రో ప్రభుత్వం పటాపంచలు చేసింది. ఆ రకంగా అత్యాధునిక ఆయుధాలతో వచ్చిన అమెరికా మద్దతు దళాలను క్యూబా సైన్యం కేవలం 72 గంటల్లోనే తుత్తునియలు చేసింది. ఆ రకంగా క్యూబాను దెబ్బతీయాలని అమెరికా వేసిన 'బే ఆఫ్ పిగ్స్' ప్రణాళికా చరిత్రలోనే అతిపెద్ద పరాజయంగా మూటగట్టుకుంది. 1962 నాటి 'క్యూబన్ మిస్సైల్ క్రైసిస్' సమయంలోనూ ప్రపంచం అణుయుద్ధం అంచున నిలిచినా క్యాస్ట్రో ఏమాత్రం తలవంచకుండా ధైర్యంగా ఎదుర్కొన్నారు.
ఫిడెల్ కాస్ట్రో చాకచక్యమైన సైనిక వ్యూహకర్తగా పేరు గడించారు. క్లిష్ట సమయాల్లో తన సైన్యాన్ని వెనక్కి రప్పించడం, భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి చిన్న అవకాశం దొరికినా నిర్భయంగా ఎదురుదాడి చేయడం వంటి వాటిల్లో ఆయన అందెవేసిన చేయిగా ఉండేవారు. 'ప్రపంచ కష్టాలకు పెట్టుబడిదారీ విధానమే కారణం'అని కాస్ట్రో అనేక సందర్భాలలో తీవ్రమైన విమర్శలు చేయడాన్ని ప్రత్యేకంగా గమనించాలి.
కాస్ట్రో 90 ఏళ్ల వయసులో 2016 నవంబర్ 25 నాడు మరణించారు. నేడు కాస్ట్రో భౌతికంగా లేకపోయిననూ ఆయన రగిలించిన విప్లవ నిప్పురవ్వలు ప్రపంచమంతటా ప్రజ్వలిస్తూనే ఉన్నాయి. క్యూబన్ కమ్యూనిస్టుల ఆదర్శాలు చరిత్రలో సజీవంగా నిలిచి ఉంటాయి. అత్యంత ప్రభావవంతమైన కమ్యూనిస్ట్ విప్లవకారుడుగా ఫిడెల్ కాస్ట్రో ప్రజా హృదయాలలో కలకాలం వెలుగొందుతూనే ఉంటారు.

**( ఆగస్టు 13 ఫిడెల్ కాస్ట్రో శత జయంతి )**

**జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్**
**సెల్:94933 19690**





## దివ్యాంగుల సంక్షేమంపై కేంద్ర మంత్రితో ఎంపీ అర్వింద్ భేటీ

**నిజామాబాద్// న్యూఢిల్లీ// ఆగస్టు 12:తెలంగాణ వాణి ప్రతినిధి**
నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డా. వీరేంద్ర కుమార్‌ను బుధవారం న్యూఢిల్లీలో కలిశారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం, సాధికారతపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. దివ్యాంగుల సమస్యలు, సంక్షేమ పథకాలు, సహాయక పరికరాల పంపిణీ, ప్రభుత్వ సేవల సులభతపై ఎంపీ వివరించారు. వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాల కోసం అంచనా శిబిరాలు విస్తరించాలని కోరారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెంచడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో అందుబాటు సౌకర్యాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో కేంద్ర పథకాలు అర్హులందరికీ చేరేలా పనిచేస్తున్నామని ఎంపీ తెలిపారు. సహకారానికి కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## పేదరిక పరిస్థితి ఆలోచన మాత్రం ఉన్నతం




**నిర్మల్, ఆగస్టు 12(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జఫ్రాపూర్ ప్రాథమిక పాఠశాల లో మౌలిక వసతుల మరియు నాణ్య మైన విద్యా అభివృద్ధికి జఫ్రాపూర్ గ్రామ నిరు పేద కుటుంబానికి ఆర్మూర్ చాకలి బక్కన్న గారు 5000 ల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. సోన్ మండలం జాఫ్రాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆర్మూర్ చాకలి బక్కన్న తన వంతుగా ఆర్థిక సహాయం అందించారు.
ఆర్థికంగా నిరుపేద కుటుంబానికి చెందినప్పటికీ, తన కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ ముగ్గురు పిల్లలను చదివిస్తూ, విద్యాభివృద్ధిపై ఉన్న తన అభిమానాన్ని చాటుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో తనకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని
ఈ సందర్భంగా చాకలి బక్కన్నను మండల విద్యాధికారి తోడి శెట్టి పరమేశ్వర పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి వి శ్యామ్ సుందర్ మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. పేదరికాన్ని అధిగమించి విద్యకు, పాఠశాల అభివృద్ధికి సహకరించిన ఆయన సేవాభావం సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని వారు కొనియాడారు.
పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడింది ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమే

### రానున్న ఎన్నికల్లో బస్ గుర్తుపై ఓటేసి గెలిపించాలి : ఈదురు వెంకన్న



**మధిర, ఆగస్టు 12 (తెలంగాణ వాణి)**
ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేసిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్‌కే దక్కుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. రానున్న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మధిరలోని ఎంప్లాయిస్ యూనియన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించిందన్నారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కార్మికులంతా ఐక్యంగా నిలిచి బస్ గుర్తుపై ఓటు వేసి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలని వెంకన్న కోరారు. యూనియన్‌కు బలం చేకూరితే ఆర్టీసీ కార్మికుల సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించేందుకు పోరాటాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీ ఎన్నిక



**చౌటుప్పల్ ఆగస్టు 12 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
చౌటుప్పల్ మండలం ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం బుధవారం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోజు యజ్ఞమాచారి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు తోర్పునూరి సాయిలు గౌడ్,చింతల గణేష్, భారత మధు, వరగంటి వెంకటేష్, నందగిరి పరమేష్, జక్క చలమంద రెడ్డి, బోడిగే ప్రభాకర్ అధ్యక్షులు సుక్క స్వామి, ఉపాధ్యక్షులు ఎర్ర శివ, వరికుప్పల మహేష్, ప్రధాన కార్యదర్శి వనం రుషి, కోశాధికారి రోషణ గారి రాఘవేంద్ర గౌడ్, సహాయ కార్యదర్శి పల్లెర్ల సుజిక్ ,ప్రచార కార్యదర్శి పగడాల శంకర్,కార్యవర్గ సభ్యులు మలిగె రవి, పగిళ్ల మహేష్. డాకోజీ వెంకట శివకుమార్,జాజుల రామకృష్ణ. పెడకంటి నాగేంద్ర లను ఎన్నుకున్నారు.

## శిథిలావస్థలో చిన్నకొండూర్ ప్రాథమిక పాఠశాల

### పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు.. విద్యార్థుల భద్రతపై ఆందోళన




**చౌటుప్పల్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంటసేపు వర్షం కురిస్తే చాలు.. పాఠశాల భవనం నుంచి నీరు కారే పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడం, సరిపడా తరగతి గదులు, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో విద్య అందించాల్సిన ప్రభుత్వ పాఠశాలే సమస్యలతో సతమతమవుతుండటంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ప్రైవేట్ స్కూల్ వద్దు.. గవర్నమెంట్ స్కూల్ ముద్దు" అంటూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని చెబుతున్న నాయకులకు చిన్నకొండూర్ పాఠశాల దుస్థితి కనిపించడం లేదా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. అదనపు తరగతి గదులు నిర్మించడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించి, చిన్నారులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## వినాయక ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**రాజపేట ఆగస్టు: 12(తెలంగాణ వాణి విలేకరి)**
రాజాపేట మండల కేంద్రంలోని రఘునాథపురం గ్రామంలో మార్కండేయ పద్మశాలి సంఘ భవనంలో బుధవారం రోజున వినాయక ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మెడిసిటీ హాస్పిటల్ వైద్య బృందం వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో బీపీ షుగర్ కంటి పరీక్షలతో పాటు చెవి ముక్కు వరిబీజం బీజ కట్టు కంతులు థైరాయిడ్ గడ్డలు గర్భసంచికి సంబంధించిన సమస్యలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చర్మ సమస్యలు మోకాళ్ళ నొప్పులు నడుము నొప్పులు వెన్నుపూస ఆపరేషన్లు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. సుమారు 200 మంది పైగా పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందుల పంపిణీ కూడా చేశారు. కార్యక్రమంలో సామల భాస్కర్ నాగేష్ బల్ల నరహరి బింగి రమేష్ నల్ల అశోక్ వెంగల్ దాస్ వెంకటేశం కటకం నాగేష్ బల్ల మహేష్ పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఆగస్టు 31లోగా చేయూత పెన్షన్ల పూర్తి డేటా సేకరణ



**జమ్మికుంట, ఆగస్టు 12, (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో చేయూత పెన్షన్లకు అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను ఆగస్టు 31, 2026లోగా పూర్తిస్థాయిలో సేకరించాలని మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి అధికారులను ఆదేశించారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ జి. మల్లికార్జున స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడారు. ప్రతి వార్డులో కౌన్సిలర్ల సహకారంతో వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి చేయూత పెన్షన్లకు సంబంధించిన వివరాలను సేకరించాలని సూచించారు. పెన్షన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ పొందని వారిని గుర్తించి, అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులు పెన్షన్ పొందకుండా ఉన్నట్లయితే వారిని గుర్తించి, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పెన్షన్ దరఖాస్తుల కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా ఇంటింటికీ వెళ్లి సమగ్ర వివరాలు సేకరించాలని, అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకానికి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్లు భాస్కర్, శ్రీనివాస్, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై హుస్నాబాద్ మండల బీజేపీ సమావేశం




**హుస్నాబాద్ ఆగస్టు 12 (తెలంగాణ వాణి ఆర్ సి)**
హుస్నాబాద్ మండల కేంద్రంలోని వి. యల్.రెడ్డి ఫంక్షన్ హాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహణపై మండల స్థాయి సమావేశం బీజేపీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్యా సంపత్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశానికి మండల ప్రభారీ తోట స్వరూప ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా తోటస్వరూపమాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అనేది కేవలం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయడం మాత్రమే కాదు, ప్రతిభారతీయుడిలో దేశభక్తిని, జాతీయ ఐక్యతను పెంపొందిస్తూ,స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకునే గొప్ప కార్యక్రమమని అన్నారు.ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకంరెపరెపలాడేలా చేసిదేశంపట్లమనకున్న గౌరవాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15స్వాతంత్ర్యది నోత్సవాన్ని ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో, ప్రతి ఇంటిలో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని, ఇప్పటి నుంచే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. హుస్నాబాద్ మండలంలోని ప్రతి గ్రామంలో జాతీయ జెండాలతో, దేశభక్తి నినాదాలతో, ఘనమైన కార్యక్రమాలతో ఆగస్టు 15 వేడుకలను పండుగ వాతావరణంలోనిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సందర్భంగా హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్యా సంపత్ నాయక్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్ర మాన్ని హుస్నాబాద్ మండలంలోవిజయవంతం చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజల్లోచైతన్యంతీసుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్,బూతగడ్డపు బాలరాజు,మండల ప్రధాన కార్యదర్శులు బైరి అరుణ్, తడిసిన రత్నాకర్, సీనియర్ నాయకులు రాజన్ నాయక్, కుంట మల్లయ్య,రజనీకాంత్,, బూత్ అధ్యక్షులు బొల్లి సుధాకర్, మధుసూదన్, గుండాల ప్రశాంత్,గుజ్జుల బాలరాజు, గంటల రాజేందర్, రాములు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్లలో ఘనంగా అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద వితరణ



**కోరుట్ల రూరల్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నపూర్ణ అమావాస్య సందర్భంగా బుధవారం కోరుట్లలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ ఫణీంద్ర శర్మ వైదిక నిర్వహణలో సామూహిక గోపూజ, అన్నపూర్ణ మాత పూజ నిర్వహించిన అనంతరం సుమారు 800 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. పితృదేవతల ప్రీత్యర్థం, లోకకల్యాణం కోసం ప్రతి అమావాస్యనాడు నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమం 13 నెలలుగా నిరంతరాయంగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో అన్నప్రసాదం వడ్డించడం విశేషం. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షుడు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి బట్టు హరిక్రిష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, అన్నపూర్ణ అమావాస్య అన్న ప్రసాద సేవ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వనపర్తి చంద్ర మోహన్, కన్వీనర్ గంప శివ కుమార్, ట్రెజరర్ మంచాల రమేష్, సభ్యులు మంచాల రాజలింగం,శ్రీపతి రమేష్, కట్కం రంజిత్ కుమార్, పల్లెర్ల మహేందర్, కంఠం సదాశివ,ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్, వెంకటేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ యతిరాజం నర్సయ్య, ఆర్ శ్రీనివాస్ రావు,కట్కం జగదీశ్వర్, కొత్త గణేష్, మాడిశెట్టి రవీందర్, అడువాల ప్రభాకర్, మల్లన్న ,చౌదరి సూర్యకాంత్, ఎలిమి బుచ్చన్న, కమటాల భాస్కర్, అల్లాడి మహేష్, కొత్త హన్మయ్య, గుడిసె కోటేష్, ఏనుగందుల రాజేంద్ర ప్రసాద్, మహిళా సేవకులు గంప రమాదేవి, వనపర్తి రమ్య తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

**దేశభక్తిని చాటుకున్న బిజెపి శ్రేణులు...**



**తిమ్మాపూర్, ఆగస్టు 11, (తెలంగాణ వాణి ప్రతినిధి )**
కరీంనగర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో భాగంగా బీజేపీ వెస్ట్ జోన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. వెస్ట్ జోన్ అధ్యక్షుడు జాడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ.. 2022 నుంచి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. తిరంగా కార్యక్రమాలు దేశ ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు యువతలో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశం కోసం అందరూ ఐక్యంగా నిలవాలని కోరారు. ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, యువత, ఢిల్లీ డిఫెన్స్ స్కూల్ విద్యార్థుల చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. 'భారత్ మాతా కీ జై' నినాదాలతో నగరంలోని పలు ప్రాంతాలు మార్మోగాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల ఆంజనేయులు, పార్లమెంటు కన్వీనర్, కార్పొరేటర్ ప్రవీణ్ రావు, సీనియర్ నాయకుడు గుజ్జ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, కర్రె పద్మ అనిల్, జోన్ అధ్యక్షుడు జాడి బాల్ రెడ్డి, బూత్ ప్రెసిడెంట్ పరశురాములు, కాసం సంతోష్, గాడుగోని రమేష్, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి సమీక్ష

**అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**






**చందంపేట, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చందంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హాజరై వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందేలా పర్యవేక్షించాలని, ఉపాధి హామీ పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎల్‌పీవో, ఎంపీడీవో, తహసీల్దార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో శంషాబాద్ రాజు



**తెల్లాపూర్ ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా తెల్లాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు శంషాబాద్ రాజు తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. దేశభక్తిని చాటుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు

## బీఎస్పీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా కామేపల్లి సైదులు



**దేవరకొండ, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా కామేపల్లి సైదులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్, చీఫ్ జోనల్ ఇన్‌చార్జి ఈశ్వర్ రవీందర్ నాయక్, నల్లగొండ పార్లమెంటరీ ఇన్‌చార్జి నల్ల ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రవి శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామస్థాయికి పార్టీని విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు, యువతను పార్టీతో అను సంధానం చేస్తూ రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయంపై అవగాహన కల్పిస్తానని తెలిపారు. బహుజనుల హక్కులు, అణగారిన వర్గాల అభ్యున్నతి, డా. బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రజల మధ్య పనిచేస్తానని సైదులు పేర్కొన్నారు.

## ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ను స్వాగతం పలికిన రామావత్ రమేష్ నాయక్



**దేవరకొండ ఆగస్టు 12( తెలంగాణ వాణి ప్రతినిధి )**
కొండమల్లేపల్లి పట్టణానికి విచ్చేసిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ని మరియు కమిషన్ నెంబర్ నేనావత్ రాంబాబు నాయక్ ని కొండమల్లేపల్లి చౌరస్తాలో రామావత్ రమేష్ నాయక్ మరియు ఎస్సీ ఎస్సీ సంఘాల నాయకులు సాధారణంగా స్వాగతం పలికి శాల్వాతో సత్కరించడం జరిగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు నేనావత్ కృష్ణ, నేనావత్ మధు, ఆదిరాల రమేష్, మూడవత్ జగ్రూ నాయక్, శంకర్ నాయక్, సైదులు,కోర్ర కోటేష్, బాలు, బాలకృష్ణ, అందుగుల నాగరాజు, అందుగుల కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఆటల పోటీలు ప్రారంభించిన సర్పంచ్



**ధర్మారం, ఆగస్టు 12 (తెలంగాణ వాణి )**
గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా మండలంలోని కమ్మరి ఖాన్ పేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఆటల పోటీలను బుధవారం హెచ్ఎం కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ ఇరుగురాల మహేష్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ, స్వతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ.. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకొని దేశభక్తిని చాటాలని సూచించారు. విద్యార్థినీ విద్యార్థులు క్రీడలలో ఆసక్తిగా పాల్గొనాలని గెలుపొందిన విద్యార్థులకు తాను స్వంతంగా బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్ఫార్మర్ పట్టించుకోని విద్యుత్ అధికారులు



**రాయికోడ్ :ఆగష్టు 13(తెలంగాణ వాణి ప్రతినిధి )**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో గత కొన్ని రోజుల నుండి ట్రాన్స్ ఫార్మర్ కట్ట కూలిపోవడానికి సిద్ధంగా యూ ఉండి ప్రమాదకరంగా మారింది. గ్రామ సర్పంచ్ అశ్విని- సంగమేశ్వర్ పాటిల్ విద్యుత్ శాఖ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన నిమ్మకు నీరేతినట్టు వ్యవహారిస్తున్నారని గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కూలిపోయి క్రిందపడి ప్రమాదం జరగక ముందే సరైన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

## సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

### ఇబ్రహీంపట్నంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమీక్ష సమావేశం



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (తెలంగాణ వాణి విలేకరి)**
: సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మత దురహంకారం, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో కోరుట్ల నియోజకవర్గ పర్యవేక్షకుడు చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి రేణుకుంట్ల సాగర్ మాదిగ మాట్లాడుతూ.. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం మందకృష్ణ మాదిగ అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు.జాతి సమగ్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల పేదల అభ్యున్నతికి కృషి చేయడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.రాబోయే రోజుల్లో సామాజిక, ఆర్థిక అసమానతలపై మరో పోరాటానికి మాదిగలు సిద్ధం కావాలని, సామాజిక ఉద్యమానికి దిక్సూచిగా నిలిచేలా ఉద్యమ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని కోరారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి,జిల్లా నాయకులు చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ,కాశవతుల లక్ష్మీరాజం మాదిగ, ఇబ్రహీంపట్నం మండలం నాయకులు బంగారు హరిదాస్ మాదిగ,పోడేటి సురేష్, గొర్రె శ్రీను,తిమ్మని రాజాం,కనక గంగాధర్, కొత్తూరి నర్సయ్య, కనక దినేష్,దిలీప్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## పైడిమడుగులో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**కోరుట్ల రూరల్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కోరుట్ల మండల బీజేపీ ఆధ్వర్యంలో పైడిమడుగు గ్రామంలో విద్యార్థులు, పార్టీ నాయకులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్‌రావు హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశభక్తి, జాతీయ జెండాపై గౌరవభావాన్ని పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాసన్ జిల్లా ఉపాధ్యక్షులు గుగ్గిళ్ళ తుకారాం గౌడ్, ఎర్ర లక్ష్మి జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షులు బద్దం తిరుపతిరెడ్డి, కోరుట్ల మండల అధ్యక్షులు పంచిరి విజయకుమార్, కోరుట్ల మండల ప్రధాన కార్యదర్శి వితల రాజేందర్ రెడ్డి, గోపు ప్రశాంత్, పైడిమడుగు గ్రామ సర్పంచ్ బదుగు భూమేష్, ఉప సర్పంచ్ గాంధారి శ్రీనివాస్, వార్డ్ మెంబర్ నిరంజన్, కోరుట్ల మండల బీజేవైఎం అధ్యక్షులు వెంకటరెడ్డి రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు చల్ల లింగ రెడ్డి మండల నాయకులు మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి, సంకు నరేందర్, బొలిశెట్టి రాజేందర్, పుంద్ర విజయ్, శ్రీపతి రెడ్డి, శేఖర్, జగదీశ్వర్, భూమి వినోద్, సైదు సురేష్, సతీష్, శరత్, శ్యామ్ రాజేందర్, శ్రీధర్, ప్రభాకర్, మనోజ్, నారాయణ, ప్రదీప్, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నల్గొండలో కార్డన్ సెర్చ్ కలకలం..37 బైకులు సీజ్



**తిమ్మాపూర్, ఆగస్టు 11, (తెలంగాణ వాణి ప్రతినిధి )**
శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం తిమ్మాపూర్ మండలం నల్గొండ గ్రామంలో పోలీసులు భారీ కార్డన్ అండ్ సర్చ్ నిర్వహించారు. స్థానిక పోలీసులు, స్పెషల్ పార్టీ బలగాలు గ్రామంలో ఇంటింటా విస్తృత సోదాలు చేపట్టాయి. సరైన ధృవపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 37 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, అనధికారిక బెల్ట్ షాపులు, గుట్కా కేంద్రాలపై దాడులు నిర్వహించి భారీగా అక్రమ మద్యం, నిషేధిత గుట్కా ప్యాకెట్లను సీజ్ చేశారు. పెండింగ్ చలాన్ల ద్వారా రూ. 11,000 జరిమానా వసూలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఏసీపీ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 నంబర్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో వివాదాలు తలెత్తితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా నేరుగా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని ఆయన భరోసా కల్పించారు.ఈ కార్డన్ సెర్చ్‌లో సిఐ రమేష్, ఎస్సై లు అన్వర్, తిరుపతి, జగదీశ్వర్, సిబ్బంది, పాల్గొన్నారు.




# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

**ఆర్డీవోకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ వినతి.**
**హుస్నాబాద్ ఆగస్టు 12(తెలంగాణ వాణి ఆర్ సి)**
ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల నుతక్షణమేపరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ)ఆధ్వర్యంలోహుస్నాబాద్ ఆర్డీవో వి. రామ్మూర్తికు డీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను నివారించి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు కేటాయించాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాల ను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ నివేదికను అమలు చేయడంతో పాటు ఉపాధ్యాయులు, పెన్షనర్లకు బకాయిపడిన ఆరు విడతల డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బకాయిలను చెల్లించాలని,



పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ప్రతి పాఠశాలలో కనీసంఇద్దరుఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు మంజూరు చేయాలని తెలిపారు. అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, నూతన జిల్లాలకు డీఈవో, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ ఈవో,మండలాల కు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు, మోడల్, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, ప్రింటింగ్ ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తిచేశారు. సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమం చేపట్టి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలునిర్వహిస్తామనిఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు.కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడుఎస్.ప్రభాకర్‌రెడ్డి,రాష్ట్రకౌన్సిలర్వి.వెంకటరమణా రెడ్డి, గడ్డంలక్ష్మారెడ్డి, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సంపత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,ఈర్యానాయక్, మల్లయ్య, నాయకులు చింతకింది శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెరుకు ఫ్యాక్టరీ వెంటనే తెరిపించాలి

**రైతులకురవాణచార్జీలు చెల్లించాలి.**
**మంత్రి శ్రీధర్ బాబును కోరిన జువ్వాడి కృష్ణారావు.**



తెలంగాణ వాణి కోరుట్ల రూరల్ ఆగస్టు 12 : తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల మంత్రి ఎన్డీఎస్ఎల్ సభా సంఘం చైర్మన్ దుద్దిల శ్రీధర్ బాబును రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఈరోజు హైదరాబాదులోని గాంధీభవన్ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా లో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు కోరుట్ల నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జగిత్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు ఘాజంగి నందయ్యతో కలిసి జువ్వాడి కృష్ణారావు ఎస్ ఐ ఆర్ కార్యక్రమాల అమలుతీరును పరిశీలిస్తూ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లతో నిర్వహించిన పునఃశ్చరణ కార్యక్రమశీ సందర్భంగా స్థానిక చెరుకు రైతుల విన్నపం మేరకు ఆరోజు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని జువ్వాడి కృష్ణారావు రైతులకు హామీ ఇచ్చారు మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు చెరుకు రైతులకు ముత్యంపేట నిజాం చెక్కర ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు పండించిన రైతులు దూర ప్రాంతంలో ఉన్న కామారెడ్డి ఫ్యాక్టరీకి తరలించడానికి రవాణా చార్జీలు భారమయ్యాయని అదేవిధంగా చక్కెర రికవరీ శాతం కూడా తగ్గుచున్నదని కాబట్టిటన్నుకు 400 రూపాయలు రవాణచార్జీలు చెల్లించాలని కోరారు ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరిపించడానికి చర్యలు తీసుకోవాలని జువ్వాడి కృష్ణారావు మంత్రిని కోరగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రికి పరిస్థితి విన్నవించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్టు కృష్ణారావు పేర్కొన్నారు



## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**జమ్మికుంట తహసీల్దార్‌కు ఉపాధ్యాయ సంఘాల మెమోరాండం**
**జమ్మికుంట, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూపీఎస్సీ) పిలుపు మేరకు రెండో దశ నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం జమ్మికుంట తహసీల్దార్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ కమిషన్ నివేదికను అమలు చేయాలని, డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 25ను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అవినాష్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్ మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, డీటీఎఫ్ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి కె. సంపత్, డీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. సదానందం, డీటీఎఫ్ సీనియర్ నాయకులు ఎం. శ్రీనివాస్, పి. రాజు, పి. విజేందర్ రెడ్డి, హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్మిక కుటుంబం లేబర్ కార్డు పొందాలి

**ధర్మారం, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
ప్రతి కార్మికుడు లేబర్ కార్డు పొందాలని, తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా లేబర్ అధికారి ఎండీ రఫీ అన్నారు. ధర్మారం మండలం చావనపల్లి గ్రామంలో సర్పంచ్ వేల్పుల రేవతి--నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన లేబర్ కార్డుల నమోదు శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు లేబర్ కార్డు ఎంతో ఉపయోగకరమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని అర్హులందరూ లేబర్ కార్డులు పొందాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమానికి సహకరించిన జిల్లా కలెక్టర్, మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణతో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి



ప్రశాంత్, ఉపసర్పంచ్ తీగుళ్ల కవిత సతీష్ రెడ్డి, వార్డ్ సభ్యులు బెదుగం హారిక అంజయ్య, తీగుళ్ల రవళి కిరణ్,కార్మిక సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వల్బాపూర్‌లో అన్నదమ్ముల మధ్య భూ వివాదం

**రోడ్డు పక్క భూమిని న్యాయబద్ధంగా పంచాలని తమ్ముడి విజ్ఞప్తి**
**వీణవంక, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం వల్బాపూర్ గ్రామంలో అన్నదమ్ముల మధ్య భూ వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన శ్రీనివాస్, రవీందర్, దేవేందర్ ముగ్గురు అన్నద మ్ములకు సంబంధించిన భూమి విషయంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు రవీందర్ తెలిపారు.తమ కుటుంబానికి చెందిన భూమిలో రోడ్డు పక్కన ఉన్న భూమిని కూడా న్యాయబద్ధంగా, సక్రమంగా పంచాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. అయితే తన అన్న శ్రీనివాస్ ఇందుకు అంగీకరించడం లేదని ఆరోపించారు. దీంతో ఇరువురి మధ్య వివాదం కొనసాగుతోందన్నారు. భూమికి సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించి న్యాయబద్ధంగా సమస్యను పరిష్కరించాలని రవీందర్ కోరారు. ఇరువర్గాల వాదనలు విని, భూ రికార్డులను పరిశీలించి వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు అధికారులను విజ్ఞప్తి చేశారు.

## కౌశిక్ రెడ్డి వైఖరి మార్చుకోవాలి: ఇంగిలే రామారావు

**ఇల్లంతకుంట, ఆగస్టు 12,(తెలంగాణ వాణి ప్రతినిధి):**
కమలాపూర్‌లో ఇటీవల జరిగిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడిన తీరును ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కౌశిక్ రెడ్డి కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.ప్రజాపాలనలో భాగంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై టీఆర్ఎస్ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని రామారావు ఆరోపించారు. కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి దాదాపు మూడేళ్లు కావస్తున్నా నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి వైపు ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, అందుకే కౌశిక్ రెడ్డి స్వేచ్ఛగా తిరుగుతున్నారని రామారావు వ్యాఖ్యానించారు. తమ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్, కాంగ్రెస్ పార్టీపై వ్యక్తిగత విమర్శలు కొనసాగిస్తే రాజకీయంగా తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను అధికారిక



కార్యక్రమాలకు ఆహ్వానిస్తోందని అభినందించిన విషయాన్ని రామారావు ప్రస్తావించారు. రానున్న ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు టీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.కౌశిక్ రెడ్డి వైఖరి నచ్చకనే టీఆర్ఎస్‌కు చెందిన కొంతమంది నాయకులు పార్టీ పెద్దలను కలిసి ఆయనపై ఫిర్యాదు చేశారని రామారావు పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి తన పద్ధతి మార్చుకుని హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్త గోలి కిరణ్, డీసీసీ కార్యదర్శి మ్యాకమల్ల అశోక్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుండారపు సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**కోరుట్ల రూరల్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో అడిషనల్ కలెక్టర్ బి. రాజగౌడ్ పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. వీఎంజీ రామ్‌జీ కార్యక్రమంలో భాగంగా జలసరి, ఫామ్ పండ్స్‌ను పరిశీలించారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాలను సంరక్షించాలని, ఇంకుడు గుంతల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో రఘువరన్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ బదుగు భూమేష్, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## అక్రమంగా పిడిఎస్ బియ్యం కఠిన చర్యలు తప్పవు

### ఎస్సై తక్యుద్దీన్

**రాజపేట,ఆగస్టు 12:(తెలంగాణ వాణి విలేకరి)**
అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రాజాపేట పోలీసులు పట్టుకున్నారు. పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్యా నితిన్ అశోక్ లేలాండ్ వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ తక్యుద్దీన్ తెలిపారు. పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు

## బీసీ విద్యార్థులకు నీట్, జేఈఈ ఉచిత శిక్షణ

### ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలి



**తిమ్మాపూర్, ఆగస్టు 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నీట్ యూజీ, జేఈఈ-2027 ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే బీసీ విద్యార్థులకు తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉచిత లాంగ్‌టర్మ్ రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తోంది. 2026లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ నెల 16వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలలోపు ఉండాలి. ఇంటర్ మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించనుండగా, అవసరమైతే స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. బాలికలకు నాగిరెడ్డిపేట సీవోఈలో నీట్ 100, జేఈఈ 40 సీట్లు, బాలురకు అబ్దుల్లాపూర్‌మెట్ సీవోఈలో నీట్ 50, జేఈఈ 50 సీట్లు కేటాయించారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, స్టడీ మెటీరియల్‌తో పాటు నిపుణుల బోధన, మాక్, గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు. అర్హులు **mjptbcadmissions.org** ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## వైద్య విద్య ప్రవేశ పరీక్ష బాధ్యతలు రాష్ట్రాలకే అప్పగించాలి

### నీట్ విధానంపై విద్యార్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలి: జీవన్‌రెడ్డి



**జగిత్యాల, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వైద్య విద్య ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. నీట్ విధానంపై విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రికి రాసిన సుదీర్ఘ లేఖను ఆయన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఒకే నీట్ పరీక్ష నిర్వహణలో ప్రశ్నపత్రాల లీకేజీ, సాంకేతిక సమస్యలు, ఇతర అవకతవకలు చోటుచేసుకుంటే వాటి ప్రభావం దేశంలోని విద్యార్థులందరిపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంలో వైద్య విద్య ప్రవేశ పరీక్షలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించేవని, ప్రస్తుతం ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నీట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒకే ప్రవేశ పరీక్ష విధానం వల్ల రాష్ట్రాల స్థానిక విద్యార్థులకు అందుబాటులో ఉన్న వైద్య విద్యా అవకాశాలు పరిమితమవుతున్నాయనే ఆందోళనలు ఉన్నాయని అన్నారు. తెలంగాణలో కొత్త జిల్లాలకు అనుగుణంగా గత ప్రభుత్వం పలు ప్రాంతాల్లో వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి వైద్య విద్యా అవకాశాలను పెంచిందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక విద్యార్థులకు రాష్ట్ర కోటా కింద మెరుగైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రాష్ట్ర జనాభాకు అనుగుణంగా వైద్య కళాశాలలు, సీట్ల సంఖ్యను పెంచడంతో పాటు పారదర్శకత, భద్రత, జవాబుదారీతనంతో ప్రవేశ పరీక్షలు నిర్వహించే విధంగా ప్రస్తుత విధానాన్ని కేంద్రం పునఃసమీక్షించాలని కోరారు. అవసరమైన చట్టపరమైన సవరణలు చేసి వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకే అప్పగించాలని ప్రధానమంత్రిని విజ్ఞప్తి చేశారు.

## చిట్యాలలో ఘనంగా తిరంగా ర్యాలీ



**చిట్యాల, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చిట్యాల మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతాకీ జై, వందే మాతరం, జైహింద్ అంటూ నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువతలో దేశభక్తి భావన పెంపొందించాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, మహిళలు, దేశభక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రావుల రాకేష్, మైదం శ్రీకాంత్, బిజెపి సీనియర్ నాయకులు చెక్క నర్సయ్య, గజనాల రవీందర్, గుండ ఓదెల శ్రీహరి నగవత్ పూర్ణ మండల ఉపాధ్యక్షుడు నల్ల శ్రీనివాస్ రెడ్డి, కేంసారపు ప్రభాకర్, వల్లాల ప్రవీణ్, చందు, కల్వచర్ల కిషోర్, రాయిని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు





**పటాన్ చెరు, ఆగస్టు 12, (తెలంగాణ వాణి):**
మండల పరిధిలోనీ ఇంద్రేశం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నాడు ఆషాఢ మాసం బోనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పాఠశాల చదువుతున్న విద్యార్థులు భక్తి శ్రద్ధలతో పోచమ్మ తల్లికి బంగారు బోనాలు సమర్పించారు. బుధవారం ఉదయం నుంచి విద్యార్థుల ఆనందోత్సాహాలతో పోత రాజుల వేషాలతో డప్పు చప్పుళ్ళతో సంతోషంగా పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి భజన కీర్తనలతో అమ్మ వారిని కీర్తించి అమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుండి మన సంస్కృతి సంప్రదాయాలు, మన పండుగల విశిష్టత తెలియ జేయడం నైతిక విలువలు పాటించడం దీని ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. బోనాలు సమర్పించిన అనంతరం ఊరు , బడిపిల్లలు ఉపాధ్యాయులను చల్లగా చూడమని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీనివాస్ రావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బండి శాంతి, సత్యనారాయణ,సాయిలు, శారద, రేవతి, లక్మణ్ రావు, సునీత , ఎల్లారెడ్డి, లాస్య, సుధా రాణి, జ్యోతి, పరమేష్ జ్యోతి పాల్గొన్నారు. విద్యార్థులకు బండి శాంతి మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు.

## యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో పటాన్‌చెరులో ఘనంగా తిరంగా యాత్ర




**పటాన్ చెరు, ఆగస్టు 12, (తెలంగాణ వాణి)**
స్వాతంత్ర్య దినోత్సవానికి మూడు రోజుల ముందు పటాన్ చెరు పట్టణంలో యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో బీఆర్ఎస్ నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలతో సాగిన ఈ యాత్రలో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువత, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వం, జాతీయ స్ఫూర్తిని చాటుతూ తిరంగా యాత్ర ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు, యువతే దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు అని పేర్కొంటూ, వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, జాతీయ స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్య క్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించాలి

**జగిత్యాల: ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజలకు పోలీస్ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయం లో బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బందితో జిల్లా ఎస్పీఅశోక్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బ్లూ కోల్ట్, పెట్రో కార్స్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్, అత్యవసర స్పందన, నేర నియంత్రణ, నేరస్తులపై నిఘా, కమ్యూనిటీ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. హాట్‌స్పాట్‌ల వద్ద పెట్రోల్ వాహనాలను కొద్దిసేపు నిలిపి, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు,



వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**డయల్ -112 కాల్స్‌కు తక్షణమే స్పందించాలి**
కంట్రోల్ రూమ్, పోలీస్ స్టేషన్, డయల్-112 లేదా ప్రజల నుంచి అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, బాధితులు, సాక్షుల నుంచి సమాచారం సేకరించడం, సంఘటనా స్థలాన్ని భద్రపరచడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. బ్యాంకులు, ఏటియం ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, ఆస్తి సంబంధిత నేరస్తులు, దొంగసొత్తు కొనుగోలు చేసే వ్యక్తులు, తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, రెసిడెంట్ అసోసియేషన్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో తరచూ కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తులను సకాలంలో గుర్తించి, వేగంగా స్పందించి వారి ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్, పెట్రోల్ కార్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి విలువైన ప్రాణాలను కాపాడటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసిఆర్బీ డిఎస్పి రవి కుమార్, బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు యువత చేతిలో..

- మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్ చెరు లో ఘనంగా తిరంగా యాత్ర

**పటాన్ చెరు, ఆగస్టు 12, (తెలంగాణ వాణి):**
దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత శక్తిని సక్రమమైన మార్గంలో వినియోగించి నప్పుడే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, యువతలో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో యువజన వికాస సమితి ఆధ్వర్యంలో పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన తిరంగా యాత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జాతీయ జెండాలను చేతబూని పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ప్రజలు ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో పటాన్ చెరు వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. విద్య, క్రీడలు, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో యువత రాణిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు.



**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**
డ్రగ్స్ యువత జీవితాలను చిన్నాభిన్నం చేయడంతో పాటు కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని, నేర ప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి తమ జీవితాలను ఉన్నత లక్ష్యాల వైపు మలుచు కోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ కేవలం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసు శాఖతో పాటు ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించి డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలని కోరారు.



దేశభక్తితో పాటు సామాజిక బాధ్యత అవసరం అని అన్నారు. తిరంగా యాత్ర వంటి కార్యక్రమాలు యువతలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని, ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన, మాదక ద్రవ్యాలకు దూరమైన యువత తోనే బలమైన భారతదేశాన్ని నిర్మించ గలమని అన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన యువజన వికాస సమితి ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, బల్వంత్, హమీద్, ధనరాజ్, షకీల్, కొండల్, టింకు, యువజన వికాస సమితి అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ గౌడ్, యువత, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుభవపూర్వక అభ్యాసానికి గీతం పెద్దపీట

- ఆటో డెస్క్ ఫ్యూజన్ ఇన్ సైడర్ కార్యక్రమం ఏర్పాటు
- చురుకుగా పాల్గొన్న విద్యార్థులు.

**పటాన్ చెరు, ఆగస్టు 12, (తెలంగాణ వాణి):**
వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్, సాంకేతిక రంగాలలో రాణించడానికి అవసరమైన పరిశ్రమతో అనుబంధం, అనుభవ పూర్వక అభ్యాసాలకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా, గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు 'ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్ సైడర్' పేరిట నైపుణ్య పెంపుదల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికి, ఉత్పత్తి రూపకల్పన, ఇంజనీరింగ్ లోని తాజా పరిణామాలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక అవకాశాన్ని కల్పించింది. క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ సుజయ్ డిసౌజా నేతృత్వంలోని ఆటోడెస్క్ పరిశ్రమ నిపుణులతో కూడిన ఎనిమిది మంది బృందం, విద్యార్థులతో సంభాషించి, అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్, ఉత్పత్తి-అభివృద్ధి రంగంపై విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. కొత్త ఆటోడెస్క్ ఉత్పత్తుల పరీక్ష, అనువర్తనాన్ని కూడా ప్రదర్శించి, విద్యార్థులకు అధునాతన రూపకల్పన,



ఇంజనీరింగ్ సాధనాలపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు మూడు వారాల వ్యవధిలో పూర్తి చేయడానికి రూపకల్పన, అనుకరణ, సాంకేతిక చిత్రలేఖనం, చిత్రీకరణ (**design, simulation, technical drawing and rendering**)తో కూడిన డిజైన్ సవాళ్లు ఇచ్చారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ప్రాజెక్టు బృందాలు, వ్యక్తిగత ప్రతిభావంతులను వారి పనితీరు, ప్రాజెక్టు ఫలితాల ఆధారంగా అవార్డులతో సత్కరించనున్నారు. విద్యార్థులు, నిజ జీవిత సవాళ్లను పరిష్కరించడానికి ఇంజనీరింగ్ పరిజ్ఞానం, డిజైన్ థింకింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ను ఎలా అన్వయించగలరో ప్రదర్శిస్తూ, బరువును మోయగలిగే ఎక్సోస్కెలిటన్, స్వయం ప్రతిపత్తి తో పనిచేసే నదీ శుభ్రత రోబోట్ వంటి వినూత్న ఉత్పత్తి-అభివృద్ధి భావనలను కూడా ప్రదర్శించారు. కోర్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రమేష్ వడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జయ ప్రకాష్ శ్రీవాస్తవ, ఆటోడెస్క్ ప్రతినిధులకు స్వాగతం పలికి, వారిని సత్కరించారు. ఇంజనీరింగ్ వృత్తిలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో పరిశ్రమ-విద్యాసంస్థల సహకారం ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అధ్యాపకుడు డాక్టర్ వీరప్రతాప్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొని, ఆటోడెస్క్ నిపుణులతో అర్థవంతమైన చర్చలలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా ప్రశ్నలడిగి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను బలోపేతం చేసుకోవడానికి, పరిశ్రమ పోకడలను అన్వేషించడానికి, అధునాతన ఇంజనీరింగ్ సాంకేతికతల ఆచరణాత్మక అనువర్తనాలను అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక సుసంపన్నమైన వేదికను అందించింది.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల: ఆగస్ట్ 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వసతి గృహంలోని నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించిన కలెక్టర్ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా కిచెన్ షెడ్‌ను నాణ్యతతో నిర్మించాలని, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఓపీ, ఐపీ సేవలు, ల్యాబ్ రికార్డులు, ఐపీ రికార్డులు, మెడికల్ ఫార్మసీ తదితర వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. రోజువారీగా ఎన్ని ఓపీలు నమోదవుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైన మందులు



అందుబాటులో ఉంచాలని, గడువు ముగిసిన మందులు ఆసుపత్రిలో లేకుండా చూడాలని ఆదేశించారు. రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు, చికిత్స వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రి ఆవరణలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. రాజ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి సుజాత, తహసీల్దార్, ఎంపీడీవో, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బొమ్మాపూర్ క్రాస్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు

**మహాదేవపూర్ ఆగస్టు 12 తెలంగాణ వాణి**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బొమ్మాపూర్ క్రాస్‌రోడ్ వద్ద మహాదేవ్‌పూర్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం మరియు సురక్షితంగా ప్రయాణించడం గురించి అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాదేవ్‌పూర్ సీఐ ఎన్. వెంకటేశ్వర్లు, స్ఐ ఎం. సాంబమూర్తి, ఏ మ్ వి ఐ సుందర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 15 ఫైన్లు విధించగా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 5 ద్విచక్ర వాహనాలు మరియు 1 బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి, వాహనాలను జాగ్రత్తగా నడపాలని పోలీసులు సూచించారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే "అరైవ్ అలీవ్ " కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని తెలిపారు.

## సంగారెడ్డిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ





**సంగారెడ్డి ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భారతీయ జనతా పార్టీ మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో పెంపొందించాలన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని, జాతీయ జెండాను గుండెల్లో నిలుపుకుంటూ దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. దేశం సాధించిన ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కోరారు. కార్యక్రమంలో 'హర్ ఘర్ తిరంగా' జిల్లా కన్వీనర్, తాజా మాజీ కౌన్సిలర్, తెల్లాపూర్ మున్సిపల్ జిల్లా కార్యదర్శి శంషాబాద్ రాజు, జిల్లా దీజీవీ అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్, కో-కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా, రాష్ట్ర బీజేపీ నాయకులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**91 ఏళ్ల విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను కాపాడేందుకు పోరాడుదాం: మేకల శ్రీనివాస్**




**కోదాడ, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
91 ఏళ్ల విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను కాపాడేందుకు మరింత బలమైన పోరాటాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు మేకల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ ఆధ్వర్యంలో కోదాడలోని పాత వాగ్దేవి జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల శ్రీనివాస్ ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న లక్నోలో ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. ఉచిత, నాణ్యమైన విద్య, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, శాస్త్రీయ దృక్పథం కోసం సంఘం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. "చదువుతూ--చదువుకై పోరాడు" అనే నినాదంతో విద్యార్థుల హక్కుల సాధనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం--2020 ద్వారా విద్యారంగంలో కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు అవకాశం ఏర్పడుతోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు పెంచి బలోపేతం చేయాలని, ఉచిత నాణ్యమైన విద్యతో పాటు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏఐఎస్ఎఫ్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ నాయకులు షేక్ నాగుల్ మీరా, బి మహేష్, నాగేంద్రబాబు త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, నవీన్, గోపి ఉపేందర్, సుష్మ భారతి అఫ్రీన్, భాను, శైలజ లతో పాటు 30మంది విద్యార్థులు పాల్గొన్నారు

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాటను సమీక్షించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు, ఆగస్టు 12, (తెలంగాణ వాణి):**
రాబోయే స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని, పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నిర్వహించనున్న వేడుకల పై పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయు లతో వేడుకలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే సంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్ ఫాస్ట్, తదితర కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే ప్రతి పాఠశాలకు ఐదు వేల రూపాయల నగదు బహుమతి తో పాటు, ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన పాఠశాలలకు 20 వేలు, 15 వేలు, 10 వేల రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర ఘట్టాలను, సంస్కృతిని మరిపించేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.

## మండలంలో పర్యటించిన జడ్పీ సీఈవో చందర్ నాయక్

**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 12:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని బుధవారం రోజున జెడ్పి సీఈవో చందర్ నాయక్ పర్యటించారు . ఈ సందర్భంగా మారుతున్నద గ్రామంలోని ఏర్పాటుచేసిన బోర్వెల్ రీఛార్జ్ ఫిట్ ను స్థానికంగా పరిశీలించారు . ఇలాంటి బోర్వెల్ రీఛార్జ్ ఫిట్ లను రైతులు ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెరిగి బోర్వెల్ ద్వారా సులభంగా నీటిని పంటలకు అందించే విధంగా ఉపయోగపడుతుందని సూచించారు . అనంతరం మొక్కలను నాటారు . ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు . ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షిస్తే జీవనాధారానికి ఎలాంటి సమస్య ఉండదని గుర్తు చేశారు . మండలంలోని పోచారం ప్రాజెక్టు ఓవర్ ఫ్లోను పరిశీలించారు . త్వరలో వర్షాల ప్రభావానికి ఓవర్ ఫ్లో పెరిగి ఇబ్బందులు కలిగే అవకాశం ఉంటుంది కాబట్టి . ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఆయకట్టు రైతులకు వీక్షించే ప్రజలకు రక్షణ కల్పించే విధంగా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు . అనంతరం మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాని సందర్శించారు . ఎంపీడీవో కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేసి సూచనలను సలహాలను కార్యాలయ సిబ్బందికి తెలిపారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో గంగాధర్ , గ్రామాల సర్పంచులు , అధికారులు, తదితరులు పాల్గొన్నారు .

# డిండి మండల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**డిండి ఆగస్టు 12( తెలంగాణ వాణి ప్రతినిధి)**
డిండి మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. డిండి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు అర్హత ఉన్న రైతులకు భూ పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కొత్తగా పట్టాలు పొందిన రైతులు అర్హతల మేరకు రైతు భరోసా, రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. మండలంలో అర్హత ఉన్న రైతులందరికీ పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటాం. భూమి ఉన్న ప్రతి అర్హ రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం"లి అని ఎమ్మెల్యే తెలిపారు.



**ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధి**
ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. జలసిరి పనులతో పాటు గొర్రెలు, బర్రెల షెడ్లు, పండ్ల తోటలు వంటి పనులను అర్హతలకు అనుగుణంగా గ్రామపంచాయతీ తీర్మానంతో చేపట్టుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

**డిండి ప్రాజెక్టు నీటిని పొదుపుగా వినియోగించాలి**
డిండి ప్రాజెక్టు నుంచి ఇప్పటికే వ్యవసాయ అవసరాల కోసం నీటిని విడుదల చేశామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకొని పంటల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ప్రతి గ్రామానికి తాగునీరు అందాలి**
మిషన్ భగీరథ ద్వారా మండలంలోని ప్రతి గ్రామానికి నిరంతరంగా సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పైపులైన్లు, మోటార్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

**మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం**
మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి, జీవనోపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే అన్నారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్**
వృద్ధాప్య పెన్షన్‌తో పాటు ప్రభుత్వం అందిస్తున్న వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్‌ఐవీ బాధితులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు తదితర అర్హత కలిగిన వర్గాల పెన్షన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.
"అర్హత ఉన్న ఏ ఒక్కరూ పెన్షన్‌కు దూరం కాకూడదు. అధికారులు అర్హులను గుర్తించి, నిబంధనల ప్రకారం పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలి" అని ఎమ్మెల్యే అన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష**
మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పనులపై సమీక్షించిన ఎమ్మెల్యే, ఇప్పటికే అధికారులు బాగా పనిచేస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న కొద్దిపాటి ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేయాలని సూచించారు. మండలంలో 45 గుడిసెలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని, వాటికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే చర్యలు చేపడుతున్నామనిలి తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం స్లాబ్ ఏరియా 750 చదరపు అడుగుల లోపు ఉండేలా చూడాలని సూచించారు.

**పశుసంవర్ధక శాఖపై ప్రత్యేక దృష్టి**
పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు పశువైద్య సేవలు, టీకాలు, పశువులకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ, పశుపోషణపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. పాడి, గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించి రైతుల ఆదాయం పెంచేలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

**నల్లగొండ--డిండి డబుల్ రోడ్డు పనులు**
హామ్ రోడ్డు పద్ధతిలో నల్లగొండ నుంచి డిండి వరకు డబుల్ రోడ్డు పనులను మొదటి విడతలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. రహదారి పూర్తయితే డిండి మండలంతో పాటు నియోజకవర్గ ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని అన్నారు.
" మండల అభివృద్ధే మా లక్ష్యం. రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, కార్మికులు, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదు" అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎల్పీవో, ఎంపీడీఓ, తహసీల్దార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**సాగునీటి సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి సాగునీరు అందించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు. వనపర్తి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, వర్షాభావ పరిస్థితులు, సాగు, తాగునీటి అవసరాలపై సమీక్షించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను నింపేందుకు చర్యలు తీసుకోవాలని మేఘారెడ్డి కోరారు. ఇప్పటికే వరి సాగు చేసిన రైతులు నష్టపోకుండా అవసరమైన మేర నీటిని విడుదల చేయాలని సూచించారు. కొత్తకోట మండలంలోని శంకర సముద్రం రిజర్వాయర్‌ను కూడా నింపాలని కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులను ఆరుతడి పంటల వైపు ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. మినుము, వేరుశనగ, ఆయిల పామ్ తదితర పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రాజెక్టులకు వస్తున్న నీరు, విడుదల, నిల్వ వివరాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. జూరాల, నెట్టెంపాడు నుంచి ఆన్--ఆఫ్ విధానంలో నీటిని విడుదల చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. ఇప్పటికే వరి సాగు చేసిన రైతులకు నీటి లభ్యతను బట్టి సాగునీరు అందించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. తక్కువ నీటితో సాగు చేసే పంటలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**బండార్‌నగర్ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**వనపర్తి, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి పట్టణంలోని బండార్‌నగర్ ఎంపీపీఎస్ పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పాఠశాల యూనిఫార్మ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సి.ఎం.ఓ ప్రతాప్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి మద్దిలేటి , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, వార్డ్ కౌన్సిలర్ శిరీష రమేష్ గౌడ్ , ఉపాధ్యాయులు ఎల్ చెన్నమ్మ, పి నరసింహారావు, శుద్ధిష్ఠ, సుజాత మద్దిలేటి, ధరణి, విద్యార్థులు, తల్లిదండ్రులు వార్డు ప్రజలు స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్‌కు సమాచారం లేకుండానే అనుమతులా..?

- **జూలై 16న లే అవుట్ లేకుండానే 21 స్థలాలకు అనుమతులు ఇచ్చారంటూ ఫిర్యాదు**
- **పంచాయతీ కార్యనిర్వహణ అధికారిపై సర్పంచ్ ఆరోపణలు**

**పెద్ద శంకరంపేట, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
పెద్ద శంకరంపేట గ్రామపంచాయతీలో అనుమతులు, ఇంటి నంబర్ల కేటాయింపు, వసూళ్ల వ్యవహారాల్లో కార్యనిర్వహణ అధికారి తీరుపై సర్పంచ్ జంగం రేణుక అభ్యంతరం వ్యక్తం చేశారు. పంచాయతీ పాలకవర్గానికి సమాచారం లేకుండానే కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో ఖాళీ స్థలాలకు సైతం ఇంటి నంబర్లు కేటాయించారని, ఎలాంటి లేఅవుట్ అనుమతులు లేకుండానే 21 స్థలాలకు అనుమతులు ఇచ్చినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సర్పంచ్ తెలిపారు. జూలై 16న ఈ అనుమతులు జారీ చేసినట్లు ఆమె ఆరోపించారు. నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇచ్చారా లేదా అనే విషయంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అలాగే సర్వే నంబర్ 114కు సంబంధించిన వ్యవహారంలో గ్రామపంచాయతీ రశీదులో పేర్కొన్న మొత్తానికి మించి వసూళ్లు చేసినట్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పంచాయతీ చెక్కులు, ఇతర పత్రాలపై సంతకాల విషయంలోనూ కార్యనిర్వహణ అధికారి తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నింటినీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ జంగం రేణుక, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీ అనుమతులు, ఇంటి నంబర్ల కేటాయింపు, వసూళ్లు, చెక్కుల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని వారు కోరారు.

# క్యాతనపల్లి ప్రజా సమస్యలపై కాంగ్రెస్ వినతి

**రామకృష్ణాపూర్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
క్యాతనపల్లి మునిసిపాలిటీలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలం నేపథ్యంలో మురికి కాల్వల శుభ్రత, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నీరు నిలిచే ప్రాంతాల తొలగింపు వంటి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. రహదారులపై గుంతలను పూడ్చడం, వీధి దీపాలను మరమ్మతు చేయడం, రహదారుల వెంట పెరిగిన పొదలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శ్రీనివాస గార్డెన్ నుంచి ఎంఎన్ఆర్ గార్డెన్ వరకు జంక్షన్ల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పశువులు, వీధి కుక్కలు, కోతుల బెడదను నియంత్రించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పనాస రాజయ్య, కాంగ్రెస్ నాయకులు గోపు రాజం, మేకల సురేందర్, కూనారపు శివకుమార్, కొక్కుల సతీష్, దాముక రమేష్, పందిరి లింగయ్య, బొద్దుల ప్రేమ్ సాగర్, నాగుల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## వనపర్తిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

**వనపర్తి, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హర్ ఘర్ తిరంగా పిలుపులో భాగంగా వనపర్తిలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అధికార ప్రతినిధి మాట్లాడుతూ జాతీయ జెండా దేశభక్తికి, జాతీయ ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, జిల్లా అధ్యక్షుడు నారాయణ, అధికార ప్రతినిధి నక్క మహేష్, జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సంఘం నేత దేవదాస్ శీను, ఎస్సీ మోర్చా నాయకుడు ప్రవీణ్, మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవస్థానంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు

**అన్నదాన కార్యక్రమం చేసిన రిటైర్డ్ కండక్టర్ శాస్త్రి మ్యాదరి లక్ష్మయ్య, పద్మమ్మ దంపతులు**



**వనపర్తి : ఆగస్టు 12, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
శ్రీ కొమ్ములగట్టు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పెద్దమం దడి మండలం జంగమయపల్లిలో కొమ్ముల గట్టు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొండల్, భజన నిర్వాహకులు ఎల్ఐసి కొమలారెడ్డి తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని జంగమయపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ కండక్టర్ శాస్త్రి మ్యాదరి లక్ష్మయ్య ఆయన సతీమణి పద్మమ్మ, కుమారుడు మహేందర్ కుటుంబ సభ్యులు అశ్వాకుల గోత్రం వారు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కొండల్, భజన పరులు ఎల్ఐసి కొమలారెడ్డి కోరారు.

## తొర్రూరు విద్యుత్ శాఖ డిఇగా కృష్ణ బాధ్యతల స్వీకరణ



**పాలకుర్తి, ఆగస్టు 12(తెలంగాణ వాణి ప్రతినిధి)**
తొర్రూరు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ డి ఇ గా కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి, తొర్రూరు డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## రోడ్డు భద్రత సైబర్ నేరాలు మూఢ నమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**సిద్దిపేట.ఆగస్టు12(తెలంగాణ వాణి ప్రతినిధి)**
కనువిప్పు కళా ప్రదర్శనలో చేర్యాల సిఐ బానోత్ రమేష్ నాయక్ పిలుపు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పోలీస్ కనువిప్పు తెలంగాణ సాంస్కృతిక సారధి సంయుక్త ఆధ్వర్యంలో చేర్యాల మండలం కాశెగుడిసెలు గ్రామంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదాల నివారణ సైబర్ నేరాలపై డ్రగ్స్ నివారణ మూఢ నమ్మకాలపై పోలీస్ కనువిప్పు బృందం మరియు తెలంగాణ సారధి కళాబృందం ద్వారా ప్రజలను చైతన్య పరచగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చేర్యాల సిఐ బానోత్ రమేష్ నాయక్ హాజరై మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు అని అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు అని ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారుయువత బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దని కోరారు చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దు అని మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలని సూచించారు, యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని విలువైన జీవితాలు ఆగం చేసుకోవద్దని కోరారు,చేర్యాల ఎస్ఐ అపూర్వరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలకు బాధ్యత నేర్పించాలని ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 112 కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు,ఈ కార్యక్రమంలో సర్పంచ్,మరియు ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, కనువిప్పు బృందం బాలు,రాజు, తిరుమల,అశోక్,మరియు తెలంగాణ సాంస్కృతిక సారధి టీమ్ లీడర్ శ్యామ్, సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం,సనువాల కనకయ్య,డాక్టరేట్ పన్నీరు శ్రీనివాస్,గెంటే హరిప్రసాద్,ఎల్ల సిద్దులు,బండారు నర్సింహులు,చెదిరి పద్మ, సల్ల మమత,తదితర కళాకారులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు

## హెచ్పివి వ్యాక్సినేషన్‌పై ప్రత్యేక దృష్టి



**మంచిర్యాల, ఆగస్టు 12 (తెలంగాణ వాణి):**
జిల్లాలో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్పివి వ్యాక్సిన్ అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. బుధవారం దండేపల్లి మండలం లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించి, ప్రతి టీకాకు ముందు బాలికల వివరాలను సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆశా కార్యకర్తలు తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం అందించాలని, టీకా వివరాలను యు-విన్ పోర్టల్‌లో వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నమోదును పక్కాగా నిర్వహించాలని సూచించారు. లింగాపూర్ ఉపకేంద్రాన్ని జాతీయ ప్రామాణికతకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, అవసరమైన అన్ని ప్రమాణాలు, సూచికలు, అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల నుండి బలవంతపు వసూలు అవాస్తవం



**మందమర్రి ఆగస్టు 12 (తెలంగాణ వాణి)**
గత ఫిబ్రవరి మాసం లో జరిగిన దేశ వ్యాప్త సమ్మె లో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికుల నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నామనే ఆరోపణలు అవాస్తవమని సింగరేణి సివిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు కొంగల తిరుపతి రెడ్డి, బర్ల సధానందం, చంద్రశేఖర్ లు డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్ సమావేశం లో వారు మాట్లాడుతూ జాతీయ సంఘాల ఆధ్వర్యం లో జరిగిన దేశ వ్యాప్త సమ్మెలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనడం జరిగిందని దీనికి సంబందించిన నో వర్క్ నో పేమెంట్ ఉత్తర్వులను జారీ చేపిస్తామని జాతీయ యూనియన్లు చెప్పినప్పటికి ఇప్పటికి ఆరు నెలలు గడిచిన ఉత్తర్వులు జారీ చేయలేదని అన్నారు. దీని వలన కాంట్రా క్టర్లకు ఒక్కొక్కరికి సుమారు 16 వేలు రికవరీ అయ్యాయని ఆర్ధికంగా నష్ట పోయామని వాపోయారు. కార్మికుల నుండి 500 రూపాయలు వసూలు చేస్తున్నామనే ఆరోపణలు అవాస్తవమని దీనిని ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటి కైనా సింగరేణి యాజమాన్యం నోవర్క్ నో పేమెంట్ ఉ త్తర్వులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో ఉత్తం సాగర్, శ్రీనివాస్, నర్సయ్య పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అఖిలపక్ష సమావేశం

**ఎల్లారెడ్డి, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎల్లారెడ్డి ఆర్డీఓ రోడ్డు ప్రభాకర్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ, ఎస్ఐఆర్ పురోగతి, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. నియోజకవర్గంలో 2,28,503 ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తయిందని ఆర్డీఓ తెలిపారు. పరిశీలనలో 22,469 ఫారాలు మృతులు, శాశ్వత వలసలు, డబుల్ ఓటర్లుగా గుర్తించినట్లు వెల్లడించారు. ఆగస్టు 17న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేసి, సెప్టెంబర్ 10 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. అక్టోబర్ 10న తుది జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించి కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లల అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**
**ఆదిలాబాద్, ఆగస్టు : 12 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్ర సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ హాల్ లో జిల్లాలోని 176 కాంపిటెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, మండల విద్యాశాఖాధికారులతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలు, పిల్లల అభ్యసన సామర్థ్యాల పెంపుపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి




చేయాలన్నారు. పాఠశాలల్లో చేపట్టిన బేస్‌లైన్ టెస్టు నివేదికలను ఒకటి రెండు రోజుల్లోగా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా సబ్మిట్ చేయాలని సూచించారు. అభ్యసన పురోగతిని పర్యవేక్షించేందుకు స్పష్టమైన క్యాలెండర్‌ను ప్రకటించారు. ప్రతి నెల 26వ తేదీన పాఠశాల స్థాయిలో హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమీక్ష జరిపి విద్యార్థుల ప్రగతిని నిర్ధారించుకోవాలన్నారు. అలాగే ప్రతి నెల 27న ఎంఈఓల సమక్షంలో మండల స్థాయి సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ప్రతి నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్ అధ్యక్షతన హెచ్ఎంలు, ఎంఈఓలతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి వచ్చే ఉపాధ్యాయులు తమ పాఠశాల ఎఫ్ఎల్ఎన్ నివేదికలతో హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, ఏఎంఓ లక్ష్మణ్, అజయ్, సీఎంఓ తిరుపతితో, రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం సభ్యులు నిఖిల్, వెంకటేష్, నికిత తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ఎల్లారెడ్డి, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని బీడీ కాలనీలో భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, సంక్షేమ పథకాలపై చర్చించారు. ాార్మిక నాయకులు మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 50 ఏళు నిండిన కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని, 60 ఏళ్ల తర్వాత కూడా లేబర్ కార్డు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భవనాల నిర్మాణంలో పనిచేసే మేస్త్రీల పేర్లను శిలాఫలకాలపై నమోదు చేయాలని, సిమెంట్ దుమ్ము, ధూళి కారణంగా అనారోగ్యానికి గురవుతున్న కార్మికులకు ప్రత్యేక ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. నకిలీ లేబర్ కార్డులు, తప్పుడు బెనిఫిట్లు ఇప్పిస్తున్న మధ్యవర్తులపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో. భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మర్లు సాయిబాబు. మండల ఉపాధ్యక్షులు పెద్దబాలి సాయిలు. మండల కోశాధికారి దుర్గా సింగ్ లక్ష్మణ్. మండల ప్రధాన కార్యదర్శి కరీం సలహాదారులు పోచయ్య. రామ్మోహన్. శివాజీ ూా బాబు చందర్. శ్యామ్ సత్యనారాయణ పోలెపు ప్రతాప్ రాజు కార్యవర్గ సభ్యులు మానయ్య. తిరుపతి.జయ రాములు రఫిక్ బాల జానీ సైదుల్ బాలయ్య భాగయ్య శ్రీను రవి.తదితరులు పాల్గొన్నారు

## డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

**రాబోయే పండుగల నేపథ్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు: సీపీ సాయి చైతన్య**
**నిజామాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. రాబోయే పండుగలను దృష్టిలో పెట్టుకుని బందోబస్తును కట్టుదిట్టం చేయాలని సూచించారు. బోధన్ డివిజన్ పరిధిలోని పెండింగ్ కేసులపై కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హత్య, హత్యాయత్నం, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, పేకాట, గుట్కా తదితర కేసుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దాడులు నిర్వహించి, నిందితులపై కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, బాధితులకు తక్షణ సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య, రెచ్చగొట్టే ప్రచారాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు,





బెయిల్‌పై ఉన్న నిందితులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, రాత్రి గస్తీ, వాహన తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్‌స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్ల వాహనాల నడపడంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. డయల్--112 సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. రాబోయే పండుగల సందర్భంగా 24 గంటలూ వాహన తనిఖీలు, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, విధుల్లో సిబ్బంది అలసత్వం ప్రదర్శించరాదని సీపీ స్పష్టం చేశారు. సమావేశంలో బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఆల్ఫోర్స్ విద్యార్థుల సత్తా

**13 పతకాలు కైవసం.. 3 బంగారు, 5 రజత, 5 కాంస్య పతకాలు**
**నిర్మల్--భైంసా, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
హైదరాబాద్ చంపాపేట్‌లోని మండా బాల్‌రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆగస్టు 9న నిర్వహించిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో భైంసా ఆల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో పోటీపడి మొత్తం 13 పతకాలు సాధించారు. ఇందులో 3 బంగారు, 5 రజత, 5 కాంస్య పతకాలు ఉన్నాయి. బంగారు పతకాలు: అండర్--10 కాటా విభాగంలో జాదవ్ విశాంత్, అండర్--10 కుమిటే (-26 కిలోలు) విభాగంలో జాదవ్ సుశాంత్, అండర్--10 కాటా విభాగంలో ముస్లెహా కొయినైన్ స్వర్ణ పతకాలు సాధించారు. రజత పతకాలు: పాలవర్ సిద్ధేశ్వరి, తౌసీఫ్, జాదవ్ అరుష్, బలగం అనన్య, ఎండీ. అఫ్జల్ ఉద్దీన్ వివిధ విభాగాల్లో రజత పతకాలు కైవసం చేసుకున్నారు. కాంస్య పతకాలు:



సుభాన్ ఉద్దీన్, మానెడొల్ల అరుష్, సమ్యక్ కరాండే, సెట్టెమార్ మేఘన, బిల్కురే రుద్ర కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థుల విజయంపై ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందిస్తూ విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

## పుస్తక పఠనంతోనే సమాజంలో ఉన్నత స్థానాలు సాధ్యం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఆగస్టు : 12 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకున్న వారే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని, గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు, విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడటంతో పాటు సమాజంలో సానుకూల మార్పులకు దారి తీస్తుందని పేర్కొన్నారు. చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనమని, యువత తమ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీ తరహాలోనే ఇతర ప్రాంతాల్లో కూడా త్వరలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జందాపూర్ గ్రామంలో రహదారి సమస్యను ఆర్ అండ్ బీ అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని, గ్రామానికి నూతన అంగన్వాడీ



భవనాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పరిశుభ్రత ప్రతి గ్రామ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, గ్రామ సర్పంచ్ బత్తుల గంగమ్మ, జిల్లా పంచాయతీ అధికారి. రమేష్, తహసీల్దార్ గోవింద్, డీఎల్పీఓ ఫణిధర్, ఎంపీడీఓ కృష్ణవంశీ, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



## సింగరేణి సెక్యూరిటీ సిబ్బందికి జి ఎం అభినందనలు

**మందమర్రి ఆగస్టు 12 (తెలంగాణ వాణి)**
బెల్లంపల్లి నుంచి అక్రమంగా సింగరేణి సామాగ్రిని తరలిస్తున్న వాహనాన్ని సకాలంలో గుర్తించి పట్టుకున్న మందమర్రి ఏరియా సెక్యూరిటీ సిబ్బందిని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ శాలువాలు, బహుమతులతో బుధవారం ఘనంగా సన్మానించారు. ?ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... మందమర్రి ఏరియా సెక్యూరిటీ సిబ్బంది కె. శ్రీనివాసరావు (ఇంటెలిజెన్స్ గార్డ్), సంజయ్ కుమార్ దాస్ (జూనియర్ ఇన్ స్పెక్టర్), సాగ శ్రీనివాస్, (మురళి మెయిన్ పవర్ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు) అప్రమత్తంగా వ్యవహరించి, సింగరేణి సొత్తును కాపాడటం అభినందనీయమని కొనియాడారు. వారి పనితనాన్ని, నిబద్ధతను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు.?ఏ పరిస్థితుల్లోనూ సంస్థ ఆస్తి దొంగల పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భద్రతను మరిన్ని ప్రాంతాల్లో పటిష్టం చేస్తూ సింగరేణిని సొత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమర్థవంతంగా పనిచేస్తున్న సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర్ రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎం సూపరింటెండింగ్ ఆఫీసర్ ఎస్ ఓ టు జి ఎం జి.ఎల్. ప్రసాద్, డిజిఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 16న బిచ్కుందకు సీఎం రేవంత్‌రెడ్డి

**ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ విందుకు హాజరు**



**ఎల్లారెడ్డి, ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ నెల 16న బిచ్కుందకు రానున్నారు. ఉదయం 9 గంటలకు డీబీఎల్ మైదానంలో వివాహ విందు జరగనుంది. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ బుధవారం డీబీఎల్ మైదానం, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు. వేదిక ఏర్పాట్లు, భద్రత, బారికేడ్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం పర్యటనకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు జుక్కల్ నియోజకవర్గ ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.

## చికిత్సకు రూ.2.50 లక్షల ఎల్ఓసీ



**నిర్మల్ - తానూర్: ఆగస్టు 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాగం గ్రామానికి చెందిన పిక్కల్కర్ చిన్న లక్ష్మణ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. ఈ మేరకు ఎల్ఓసీ కాపీని ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్న లక్ష్మణ్ అనారోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2.50 లక్షల ఎల్ఓసీ మంజూరైనట్లు తెలిపారు. ఎల్ఓసీ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు విట్టల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ బాలేరావు, దాగం సర్పంచ్ గాడేకర్ సాయినాథ్, హల్దా సర్పంచ్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

